# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 390 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 20-3-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో **(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
**& చైతన్య గళం** ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## క్షేమంగా భూమ్మీదకు సునీతా విలియమ్స్

ఫ్లోరిడా సముద్ర జలాల్లో దిగిన డ్రాగన్ క్రూ కాప్సూల్
వైద్య పరీక్షల కోసం తరలింపు

**ఫ్లోరిడా,మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇన్నాళ్లుగా యావత్ ప్రపంచం ఎదుర్కొన్న ఉత్కంఠకు శుభం కార్డు పడింది. 9 నెలలుగా అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ సురక్షితంగా భూమి మీద దిగారు. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3.27 గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న డ్రాగన్ క్రూ కాప్సూల్ ఫ్లోరిడా తీరానికి సమీపంలోని సముద్రజలాల్లో పారాషూట్‌ల సాయంతో సురక్షితంగా దిగింది. సునీతా, బుచ్‌లతో పాటు మరో ఇద్దరు వ్యోమగాములు కూడా వచ్చారు

-మిగతా 2 లో




## తెలంగాణ బడ్జెట్

# రూ.3,04,965 కోట్లు



- ఆరు గ్యారెంటీలు లక్ష్యంగా బడ్జెట్
- అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టితో కేటాయింపులు
- మూలధన వ్యయం రూ.36,504 కోట్లు
- రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు
- మహాలక్ష్మి పథకం కింద రూ.5,005 కోట్లు
- మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు
- మద్యం ఆదాయంతోనే చక్కబెట్టే యత్నాలు
- రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన భట్టి విక్రమార్క

### పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం

**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆరు గ్యారెంటీలకు భారీగా కేటాయింపులు చేస్తూనే....అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా భట్టి బడ్జెట్‌ను ఆయా రంగాలకు ఉన్నంతలో కేటాయింపులు చేశారు. ప్రధానంగా కేటాయింపుల్లో మహిళలకు పెద్దపీట వేశారు. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందించాం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా

-మిగతా 2 లో



## హైకోర్టులో సీఎం రేవంత్, కేటీఆర్‌ల కు ఊరట

➤ఇరు నేతలపై నమోదైన కేసుల కొట్టివేత

**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో 2020 మార్చిలో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. జన్వాడ ప్రాంతంలో డ్రోన్ ఎగురవేశారంటూ రేవంత్ రెడ్డి సహా మరికొందరిపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. అదే సమయంలో, పోలీసులు రేవంత్ రెడ్డిని అరెస్ట్

-మిగతా 2 లో



## ఢిల్లీకి మూటలు మోసేలా బడ్జెట్

నెగిటివ్ పాలిటిక్స్ వల్ల ఆదాయం తగ్గిపోయింది
అంకెలు ఎందుకు ఆగమయ్యాయో చెప్ప
బడ్జెట్‌పై ఘాటు విమర్శలు చేసిన కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఒక్క మాటలో ఈ బడ్జెట్ గురించి చెప్పాలంటే.. ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్‌లా ఉందని అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. నీ తెలివి తక్కువ తనం వల్ల, నెగిటివ్ పాలిటిక్స్ వల్ల ఆదాయం తగ్గిపోయిందని సిఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నేరుగా విమర్శలు చేశారు.మీడియా ముందు రంకెలు వేయడం కాదు.. అంకెలు ఎందుకు ఆగమాయ్యాయో చెప్పు. గత బడ్జెట్ సందర్భంగా చెప్పినట్లు మీ బడ్జెట్ అంచనాలకు ఎందుకు చేరుకోలేకపోయింది. నమ్మి ఓట్లేసిన పాపానికి 4 కోట్ల మందిని ముంచిన బడ్జెట్ ఇది అంటూ విమర్శలు చేశారు.. పదేండ్ల ప్రగతి రథచక్రానికి పంక్చర్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇది.

-మిగతా 2 లో



## రేషన్ కార్డు పాపులారిటీ కార్డుగా మారింది

అనర్హులకే బిపిఎల్ ప్రయోజనాలు
సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రేషన్ కార్డుల అంశంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రేషన్ కార్డు పాపులారిటీ కార్డుగా మారిందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హులకు రేషన్ కార్డులు అందడం లేదని సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

-మిగతా 2 లో




## ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతున్నాం

- ఎస్సీవర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం
- సీఎం రేవంత్‌ను సన్మానించిన మాదిగ సంఘాలు
- సుప్రీం తీర్పును తొలిసారిగా అమలు చేసిందే తెలంగాణ
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో అసెంబ్లీ కమిటీ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఎస్సీ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపాయి. వర్గీకరణ పోరాటంలో అమరులైన వారికి నివాళిగా 2 నిముషాలు మౌనం పాటించారు సీఎం, పీసీసీ

-మిగతా 2 లో

## అబద్ధాలతో నిండిన బడ్జెట్



వాస్తవ విరుద్ధంగా కేటాయింపులు
మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ బడ్జెట్‌పై మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు మేలు చేసేలా కాకుండా, పూర్తిగా అబద్దాలతో నిండిన బడ్జెట్‌గా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీలో భట్టి విక్రమార్క ప్రసంగాన్ని విమర్శిస్తూ, అది బడ్జెట్ ప్రసంగంలా కాకుండా రాజకీయ ప్రసంగంలా మారిపోయిందని

-మిగతా 2 లో

## పాడిపరిశ్రమ ప్రోత్సాహానికి పెద్దపీట



గోకుల్ మిషన్ కింద రూ.3,400 కోట్ల కేటాయింపు
అస్సోంలో రూ. 10,601 కోట్ల పెట్టుబడితోయూరియా కాంప్లెక్స్
మహారాష్ట్రలో ఆరులైన్‌ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణం
కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పాడి రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దేశంలో పాల ఉత్పత్తిని, దేశీయ పశువుల జాతుల ఉత్పాదకతను పెంచడానికి రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద రూ.3,400 కోట్ల నిధులను కేటాయించింది. ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేం ద మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటుగా మరి కొన్ని నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. పాడి పరిశ్రమ, ఎరువుల పరిశ్రమలను బలోపేతం చేయడంతో పాటు- డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి రూ.16,000 కోట్లకు పైగా పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

-మిగతా 2 లో

# తెలంగాణ బడ్జెట్ రూ.3,04,965 కోట్లు

(మొదటి తరువాయి)

కార్యాచరణ చేపడుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించాలనుకుంటున్న ఫ్యేచర్ సిటీకి మాత్రం కేవలం వంద కోట్లే కేటాయిచడం విశేషం. దీంతో ఎలా ముందుకు పోతారో చెప్పలేక పోయారు. ఇకపోతే ఆదాయంలో ప్రధాన వనరు మద్యం అమ్మకాలే కావడం విశేషం. తెలంగాణ బడ్జెట్ రూ.3,04,965 కోట్లు- కాగా.. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు- ఉందన్నారు. ఇక, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రవేశ పెడుతూ..డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటిలో మహిళకు తొలి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహలక్ష్మి పథకం కింద బస్సులో ఉచిత ప్రయాణానికి రాష్ట్ర మహిళలకు రూ.5,005 కోట్లు- ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 433 కోట్ల రూపాయలను మహిళలు ఆదా చేసుకుంటు న్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అంతేగాక ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేరుపై మంజూరుకు తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని చెప్పుకొచ్చారు. ఇక, మహిళలకు ఉద్యోగ అవకాశాల్లో కూడా దేశంలోనే అత్యధిక శాతం మన రాష్ట్రమే అవకాశాలు కల్పిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నాం. కొందరు దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రతి చర్యనూ నిందిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం 2 పడక గదుల ఇళ్లు ఇస్తామని ప్రజలకు నిరాశ మిగిల్చింది. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్నిగ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు- చేస్తాం. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తాం. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తాం. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి అద్దెకు 600 బస్సులు కేటాయిస్తాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ఓఆర్ఆర్ ఫేజ్-2 నీటి సరఫరా ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంది. ఫేజ్-2 ద్వారా హెచ్ఎండీఏలో విస్తరించిన ప్రాంతాలకు తాగునీరు అందిస్తాం. హైదరాబాద్‌లో సమగ్ర వరద నీటిపారుదల ప్రాజెక్టుకు రూ.5,942 కోట్లు- కేటాయిస్తాం. దేశానికి తలమానికంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం. శ్రీశైలం-నాగార్జునసాగర్ రహదారుల మధ్య ఇది ఉంటుంది. 56 గ్రామాలు, 765 చదరపు కి.మీ విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీ-లో ఏఐ సిటీ-, ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ-, క్లీన్ ఎనర్జీ, ఇన్నోవేషన్ జోన్లు, మల్టీ మోడల్ కనెక్టివిటీ-, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉంటాయి. ఈ ప్రాజెక్టును ఎఫ్‌సీడీఏ పర్యవేక్షిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులిలా ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖ- రూ.31,605 కోట్లు, వ్యవసాయశాఖ- రూ.24,439 కోట్లు, విద్యాశాఖ- రూ.23,108కోట్లు,మహిళా శిశు సంక్షేమశాకు రూ.2,862 కోట్లు,పశు సంవర్ధకశాఖ- రూ.1,674 కోట్లు,పౌరసరఫరాల శాఖ- రూ.5,734కోట్లు,కార్మికశాఖకు రూ.900 కోట్లు,ఎస్సీ సంక్షేమం: రూ40,232 కోట్లు,ఎస్టీ సంక్షేమం- రూ.17,169 కోట్లు, బీసీ సంక్షేమం కోసం 11,405 కోట్లు కేటాయించారు. ఇకపోతే చేనేత రంగానికి- రూ.371 కోట్లు, మైనార్టీ సంక్షేమశాఖ- రూ.3,591 కోట్లు, పరిశ్రమలశాఖ- రూ.3,527 కోట్లు, ఐటీ- రంగం- రూ.774 కోట్లు, విద్యుత్ రంగం- రూ.21,221 కోట్లు, వైద్య రంగం- రూ.12,393 కోట్లు,పురపాలక రంగం- రూ.17,677 కోట్లు,నీటి పారుదలశాఖ- రూ.23,373 కోట్లు,రోడ్లు, భవనాల శాఖ- రూ.5,907 కోట్లు,పర్యాటక రంగం- రూ.775 కోట్లు,క్రీడలు- రూ.465 కోట్లు,అటవీ, పర్యావరణం- రూ.1,023 కోట్లు, దేవాదాయశాఖ- రూ.190 కోట్లు కేటాయించారు. ఆరు గ్యారంటీలకు- రూ.56,084 కోట్లు, రైతు భరోసా- రూ.18వేల కోట్లు,చేయూత పింఛన్లు రూ.14,861 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు రూ.12,571 కోట్లు, మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు,గృహజ్యోతి- రూ.2,080 కోట్లు,సన్నాలకు బోనస్ రూ.1,800 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ- రూ.1,143 కోట్లు,గ్యాస్ సిలిండర్ రాయితీ- రూ.723 కోట్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా- రూ.600 కోట్లు,రాజీవ్ యువ వికాసం- రూ.6వేలకోట్లు,ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించారు.

# ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతున్నాం

(మొదటి తరువాయి)

అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రికి మాదిగ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేసినందుకు అసెంబ్లీ కమిటీ హాల్ లో సీఎం రేవంత్ కి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. నన్ను ఒక్కడినే కాదు.. రాహుల్ గాంధీని... కేబినెట్ ని అభినందించాలి.. రాహుల్ గాంధీ నేనున్న అని చెప్పడంతో ధైర్యం వచ్చింది.. దామోదర రాజనర్సింహ కేబినెట్ సబ్ కమిటీ- ఛైర్మన్ తీసుకో అంటే నాకు వద్దు అన్నారు.. నా పనే నేను ఎక్కువ చేసుకున్న అనుకుంటారు అని వద్దన్నారు.. 199 పేజీల విశ్లేషణ ఇచ్చారు కమిషన్ ఛైర్మన్. ఇప్పటి వరకు ఉద్యోగాలు రాని.. వర్గాలను కూడా గుర్తించాం.. ఇప్పుడు తొమ్మిది కాదు..పావు తక్కువ పది మీ రిజర్వేషన్. ఇది ఎవరికి వ్యతిరేకం కాదు.. మీకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడం.. నేను ఉన్న కాబట్టి వేగంగా సుప్రీం కోర్టు తీర్పు అమలు చేశా.. నాకు మొదటి నుండి మాదిగ పిల్లలే నా వెంట ఉన్నారని అన్నారు. మీకు సహనం ఎక్కువ.. పదేళ్లు వేచి చూశారు.. నాకు అవకాశం ఇచ్చారు.. సుప్రీం కోర్టులో కేసులు వాయిదా పడుతున్నాయి.. అందుకే నేనే మంచి అడ్వకేట్ నీ పెట్టీ- పంపిన.. మందకృష్ణతో నాకేం విభేదం లేదు.. కానీ ఆయన నా కంటే... కిషన్ రెడ్డిని ఎక్కువ నమ్ముతున్నాడు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా ఇప్పటి వరకు అమలు చేయలేదు.. మీ జాతికి న్యాయం చేయాలని అనుకున్న.. బిల్లుకు ప్రాసెస్ ఉంటది.. అందుకే పకడ్బందీగా చేశాం.బిల్లు అమల్లోకి వచ్చేంత వరకు నోటిఫికేషన్ ఇవ్వను అని చెప్పినా.. ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు.. పదేళ్లు నాతో జాతి నడుస్తుంది.. పొలం కాడా మీకు.. మాకే కదా సంబంధం.. మార్చిపోతమా.. ఓయూ కి వీసీ ఇచ్చినా.. బాసర ఐఐఐటీకి వీసీగా మాదిగకు అవకాశం ఇచ్చాం.. ఉస్మానియా ప్రిన్సిపాల్ మాదిగ నీ వేశాం.. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మన అమ్మాయే.. మా వాళ్ళను పక్కన పెట్టీ కూడా మీకు అవకాశం ఇచ్చిన.. మీకు అన్యాయం అయ్యింది అని.. అవకాశం ఇచ్చాం..ఇవాల్టి తో ఐపోలేదు. నేను ఉన్నంత వరకు మీ వాడే కుర్చీలో ఉన్నాడు అనుకోండి.. నాకు పేరు తప్పా.. ఇంకేం ఆలోచన లేదు.. చిలక్కి చెప్పినట్టు- చెప్పినా.. చింత స్వామి నాకు కాలేజి నుండి తెలుసు.. ఆవేశం తగ్గించి..ఆలోచన పెంచుకోండి. బుడగ జంగాలు ఇండ్లు ఇచ్చే బాధ్యత నాది.. కొంత ఆలస్యం అవ్వచ్చు..ఓపిక గా ఉండండి.. మీరు ఎవ్వరితో కొట్లాడకండి.. మీకేం కావాలో చేయాలో చేయడానికి మేము ఉన్నాం. ఇకపై వరుసగా నోటిఫికేషన్ లు.. పిల్లల్ని చదివించండి.. రాహుల్ గాంధీ కోసం ఓ సభ పెట్టండి.. మీరు ధర్మ యుద్ధం సభ పెట్టినప్పుడు నేను అండగా ఉన్న.. మీరు కూడా అండగా ఉండండి.. అభినందన కంటే గాంధీ కుటు-ంబానికి ఏం కావాలి అని ఉండదు' అని సీఎం రేవంత్ అన్నారు.

# ఢిల్లీకి మూటలు మోసేలా బడ్జెట్

(మొదటి తరువాయి)

రేవంత్ రెడ్డి అసమర్థతకు, చేతగానితనానికి నిలువుటద్దం ఈ బడ్జెట్. వీరి అసమర్థతత, చేతకాని తనం వల్ల ఆకాశం నుంచి పాతాళం వైపు ఆర్థిక వ్యవస్థ పోతున్నదంటే కచ్చితంగా బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలి. కేసీఆర్ ఏడాదికి రూ. 40 వేల కోట్ల అప్పు జేస్తే రంకెలు వేశారు. కానీ ఇవాళ ఒక్క ఏడాదికి లక్షా 60 వేల కోట్లు- అప్పు చేసి కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఒక్క ఇటు-క పేర్చలేదు. ఒక్క గ్యారెంటీ- కూడా పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే లక్షల కోట్ల అప్పు టార్గెట్ కనబడుతున్నట్టు- ఉందని కేటీ-ఆర్ పేర్కొన్నారు. తొండ ముదిరితే ఊరసవెల్లి అవుతదని పెద్దలు చెబుతారు. కానీ ఊరసవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అయితడని ఈబడ్జెట్ చూసిన తర్వాత అర్థమవుతుంది. సంక్షేమానికి సమాధి.. అభివృద్ధికి అడ్రస్ గల్లంతు.. ప్రజలకు ఇచ్చిన హామీలకు ఘోరీ కట్టి.. పార్టీ కార్యకర్తలకు మాత్రం వీళ్ల అబ్బ సొత్తు.. పప్పుబెల్లం లాగా 6 వేల కోట్లు- పంచి పెడుతారట. కార్యకర్తలకు ఇస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి ఈ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరు. పప్పుబెల్లంలాగా పంచి పెడుతామంటే.. అది యువ వికాసం కాదు కాంగ్రెస్ వికాసం అయితది అని కేటీఆర్ మండిపడ్డారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ విమర్శలు గుప్పించారు. బడ్జెట్‌లో తెలంగాణ ఆడబిడ్డకు తీరని అన్యాయం చేశారని ఆయన అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ-లు గోవిందా అని అర్థమైందని పేర్కొన్నారు. ఏడాది దాటిన ఉద్యోగాల ఊసే లేదని.. బిఆర్ఎస్ హయాంలో వచ్చిన నోటిఫికేషన్లు తామే ఇచ్చినట్లు- కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2వేలు, రూ.4వేలు పెన్షన్లు ఇస్తామన్న పాతరేశారని మండిపడ్డారు. కులగణన సర్వే పేరుతో వెనుకబడిన వర్గాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ఎజెండా నెరవేర్చాల్సిన సమయం 40 శాతం గడిచిపోయిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అందమే సక్కగా లేదు కానీ.. అందాల పోటీ-లు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. రంకెలు కాదు రేవంత్ రెడ్డి.. అంకెలు ఎక్కడ పోయినాయి అని ప్రశ్నించారు. ఆకాశం నుంచి బడ్జెట్ పాతాళానికి పడిపోతుందని.. పాలన చేతకాని ప్రభుత్వం.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు.

# అబద్ధాలతో నిండిన బడ్జెట్

(మొదటి తరువాయి)

అన్నారు. హరీష్ రావు ప్రకారం, బడ్జెట్‌లో పేర్కొన్న అనేక విషయాలు నిజాలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా, వడ్డీ లేని రుణాల విషయాన్ని ప్రస్తావిస్తూ, కోటి మంది మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామన్నది పూర్తిగా అబద్ధమని, అసలు వాస్తవం ఏమిటంటే 5 లక్షల రూపాయల వరకు మాత్రమే వడ్డీ లేని రుణం అందుబాటు-లో ఉందని తెలిపారు. అలానే, స్టిచింగ్ చార్జీల విషయంలో కూడా ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రకటించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.75 మాత్రమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్న విమర్శను ఖండించిన హరీష్ రావు, తమ హయాంలో 20 లక్షల మందికి రేషన్ కార్డులు మంజూరు చేశామని, ఇది ప్రభుత్వ రికార్డుల ద్వారా స్పష్టమవుతోందన్నారు. హరీష్ రావు మహాలక్ష్మి పథకాన్ని ప్రస్తావిస్తూ, బడ్జెట్‌లో మహిళలకు రూ.2,500 ఇవ్వబోతున్నామని చెప్పినా, అసలు దీనిపై ఎలాంటి స్పష్టత లేదని అన్నారు. అంతేగాక, ఈ బడ్జెట్‌లో అందాల పోటీ-ల కోసం రూ.250 కోట్లు- కేటాయించారని ఎద్దేవా చేశారు. పింఛన్లను రూ.4,000 చేయలేదని, అలాగే లక్ష మంది లబ్ధిదారులను తొలగించారని హరీష్ రావు ఆరోపించారు. అదేవిధంగా, ప్రభుత్వం రైతులకు పూర్తిగా రుణమాఫీ చేశామని చెప్పినా, వాస్తవానికి ఎక్కడా అమలు చేయలేదని తెలిపారు.హరీష్ రావు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రస్తావిస్తూ, రాష్ట్ర స్థూల ఉత్పత్తి తగ్గిపోయిందని, ప్రభుత్వం దివాళా తీసినట్టు-గా ఉందని విమర్శించారు. మద్యం ఆదాయం ద్వారా రాష్ట్రానికి రూ.50,000 కోట్లు వస్తున్నాయని చెప్పిన హరీష్ రావు, తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చేస్తారా అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## రేషన్ కార్డు పాపులారిటీ కార్డుగా మారింది

(మొదటి తరువాయి)

తలసరి ఆదాయం పెరుగుతుందని చెప్పే రాష్ట్రాలు కూడా బీపీఎల్ కుటుంబాలు ఎక్కువ ఉన్నాయని చెబుతాయని ధర్మాసనం పేర్కొంది. పేదలకు న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకే రాష్ట్రాలు రేషన్ కార్డుల లెక్కలు చెబుతున్నాయని.. వాస్తవానికి మాత్రం పేదలకు రేషన్ ఫలాలు అందడం లేదని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనర్హులే ఎక్కువగా బీపీఎల్ ప్రయోజనాలు పొందుతున్నారని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల రేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# క్షేమంగా భూమ్మీదకు సునీతా విలియమ్స్

(మొదటి తరువాయి)

తొలుత సునీతా, బుచ్‌ను నాసా సిబ్బంది జాగ్రత్తగా క్యాప్సూల్ నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతరం వారిని వైద్య పరీక్షల కోసం స్ట్రెచ్చర్లపై తరలించారు. ఐఎస్ఎస్‌లోని సూక్ష్మస్థాయి గురుత్వాకర్షణ శక్తిలో ఎక్కువ సమయం గడిపినందుకు ఇద్దరు వ్యోమగాములు బలహీనంగా మారారని నిపుణులు చెబుతున్నారు. కండరాలు క్షీణించడం, సరిగా నిలబడలేక బ్యాలెన్స్ కోల్పోవడం వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ ల్యాండింగ్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఇక సునీతా విలియమ్స్ ల్యాండింగ్‌కు సంబంధించి 2013లో వచ్చిన హాలీవుడ్ మూవీ గ్రావిటీ- సినిమాకు గుర్తుకుతెచ్చింది. 2013లో హాలీవుడ్ నుంచి వచ్చిన సైన్స్ ఫిక్షన్ చిత్రం గ్రావిటీ. ఈ సినిమాలో హాలీవుడ్ హీరోయిన్ సాండ్రా బుల్లక్ కథానాయికగా నటించగా.. అల్ఫోన్సో కారోన్ దర్శకత్వం వహించాడు. అయితే ఈ సినిమా క్లైమాక్స్‌లో సాండ్రా బుల్లక్ అంతరిక్షం నుంచి భుమికి ల్యాండ్ అయిన సన్నివేశం ప్రస్తుతం సునీత విలియమ్స్ ల్యాండింగ్‌ను గుర్తుకుతెస్తుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం వారిని హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలిస్తారు. అక్కడ కొన్ని రోజుల పాటు వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిశితంగా గమనిస్తారు. వ్యోమగాముల ఆరోగ్య పరిస్థితిని నానా వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే కుటుంబ సభ్యులు వారిని కలుసుకునేందుకు అనుమతిస్తారు. ఇక అంతరిక్షంలో వ్యోమగాముల అనుభవాలను కూడా నాసా రికార్డు చేయనుంది. సుదీర్ఘకాలం అంతరిక్షంలో ఉన్న సమయంలో ఎదురైన సవాళ్లు, అనుభవాలు వంటివన్నీ తెలుసుకుని నాసా అధికారులు రికార్డు చేసుకుంటారు. చివరిగా వ్యోమగాములను తమ కుటుంబసభ్యులను కలుసుకునేందుకు అనుమతి ఇస్తారు. భూమ్మీదకు వచ్చాక తాను ముందుగా కుటుంబసభ్యులతో పాటు పెంపుడు శునకాలను కూడా చూడాలనుకుంటున్నట్టు- సునీతా విలియమ్స్ ఇటీవల పేర్కొన్నారు. గతేడాది బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకలో ఎనిమిది రోజుల అంతరిక్ష యాత్ర కోసం వెళ్లిన ఇద్దరు వ్యోమగాముల సాంకేతిక సమస్యల కారణంగా అక్కడే తొమ్మిది నెలల పాటు- చిక్కుకుపోయిన విషయం తెలిసిందే.

# హైకోర్టులో సీఎం రేవంత్, కేటీఆర్‌ల కు ఊరట

(మొదటి తరువాయి)

చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఈ కేసును ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టులో వాదిస్తూ, జన్వాడ ఏరియా నిషిద్ధ ప్రాంతం కాదని స్పష్టం చేశారు. పోలీసులు అనవసరంగా ఈ కేసును నమోదు చేశారని తెలిపారు. పైగా, ఈ కేసులో రేవంత్ రెడ్డిపై తప్పుడు సెక్షన్లు ప్రయోగించారని వాదించారు. ప్రభుత్వ అభిప్రాయాన్ని వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కూడా, డ్రోన్ ఎగురవేసిన ప్రాంతం నిషిద్ధ జాబితాలో లేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి తరఫు వాదనలను పరిశీలించిన హైకోర్టు, 2020 మార్చిలో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుతో రేవంత్ రెడ్డికి అనుకూలమైన తీర్పు లభించిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. కేసు కొట్టివేతతో, 2020లో నమోదైన వివాదం ముగిసినట్టయింది. ఇకపోతే మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పై నమోదైన కేసును కూడా హైకోర్టు కొట్టివేసింది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు, ఇరువురి వాదనలు పరిశీలించి ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ కీలక తీర్పు ఇచ్చింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ కేటీఆర్‌పై కేసు నమోదు జరిగింది. ఈ వ్యవహారంపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, ఈ కేసులో సరైన ఆధారాలు లేవని, రాజకీయ కోణంలో దీనిని చూచితే సబబుగా ఉండదని కేటీ-ఆర్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. హైకోర్టు విచారణ సందర్భంగా, ఇరువురి వాదనలను పరిగణనలోకి తీసుకుంది. కేసు నమోదైన తరహా, అందులో పేర్కొన్న సెక్షన్లను సమీక్షించిన తర్వాత, ఈ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని హైకోర్టు తేల్చింది. దీంతో, సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుతో కేటీఆర్‌కు ఊరట లభించింది.

# పాడిపరిశ్రమ ప్రోత్సాహానికి పెద్దపీట

(మొదటి తరువాయి)

దేశంలో పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు- దేశీయ పశువుల జాతుల ఉత్పాదకతను పెంచడానికి రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద రూ.3,400 కోట్ల నిధులు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. అలాగే.. అస్సాంలోని నమ్రూప్‌లో రూ. 10,601 కోట్ల పెట్టుబడితో కొత్త బ్రౌన్‌ఫీల్డ్ అమ్మోనియా-యూరియా కాంప్లెక్స్ ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ నేతృత్వంలోని ఈ ప్రాజెక్ట్ ఏటా 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఎరువుల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి ఈశాన్య ప్రాంతంలోని రైతులకు సకాలంలో ఎరువులు అందేందుకు ఇది ఉపయోగపడుతోందన్నారు. పగోట్‌ను మహారాష్ట్రలోని చౌక్‌తో అనుసంధానించడానికి రూ.4,500 కోట్ల పెట్టుబడితో 6 లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైస్పీడ్ నేషనల్ హైవే నిర్మాణానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని పేర్కొన్నారు. యూపీఐ లావాదేవీలు రూ. 210 లక్షల కోట్లకు చేరుకున్నాయని కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రూ. 2 వేలు కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు ఎలాంటి ఛార్జీ లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుత యూపీఐ విధానంలో కస్టమర్ బ్యాంక్, ఫిన్‌టెక్ సంస్థ, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్, యాప్ సంస్థ ద్వారా 4 అంచెల్లో లావాదేవీలు జరుగుతున్నాయని వివరించారు. తద్వారా లావాదేవీల్లో చార్జీలను భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రూ.1,500 కోట్లు ఇన్సెంటివ్ రూపంలో చిన్న లావాదేవీలకు చార్జి లేకుండా చేస్తున్నామన్నారు. మరోవైపు మహారాష్ట్రలో రూ.4,500. 62 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు వెల్లడించారు.ఈ రహదారి సరకు రవాణాలో ఎంతో ప్రయోజనకార ప్రాజెక్టుగా మారనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

## తెలుగు పంచాంగం 20/3/2025 గురువారం



సూర్యోదయం: ఉదయం 6:23
సూర్యాస్తమయం: సాయంత్రం 6:23
తిథి:
కృష్ణ పక్ష షష్ఠి: మార్చి 20 రాత్రి 12:37 నుండి మార్చి 21 రాత్రి 2:45 వరకు
నక్షత్రం:
అనూరాధ: మార్చి 19 రాత్రి 8:50 నుండి మార్చి 20 రాత్రి 11:31 వరకు
జ్యేష్ఠ: మార్చి 20 రాత్రి 11:31 నుండి మార్చి 22 ఉదయం 1:45 వరకు
అశుభ సమయాలు (దోష కాలాలు):
రాహుకాలం: మధ్యాహ్నం 1:46 నుండి 3:17 వరకు
యమగండం: ఉదయం 6:12 నుండి 7:42 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 10:14 నుండి 11:02 వరకు, మధ్యాహ్నం 3:04 నుండి 3:53 వరకు
వర్జ్యం: ఉదయం 5:39 నుండి 7:24 వరకు
శుభ సమయాలు (శుభ ముహూర్తాలు):
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:51 నుండి 12:39 వరకు
అమృతకాలం: మధ్యాహ్నం 11:57 నుండి 1:44 వరకు


# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్ణాకర్



**కేశంపేట,మార్చి 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామాల భివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పి శెట్టి కరుణాకర్ అన్నారు.మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే నిధులతో మంజూరైన సీసీ రోడ్డుకు సంబందించిన పనులను గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు త్రిప్పి శెట్టి సుదర్శన్ తో కలసి పూజ కార్యక్రమాలు ప్రారంభించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ,,,గ్రామాలు అభివృద్ధి కావడానికి ముఖ్యంగా సీసీ రోడ్లు నిర్మాణం ఉండాలని అన్నారు.ఎమ్మెల్యే శంకర్ గ్రామాల అభివృద్ధి కి పూర్తి సహకారం అందిస్తూన్నారని ప్రత్యేకంగా ఎమ్మెల్యే కు గ్రామం నుండి అభినందనలు తెలిపారు.అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏర్పుల లింగం,వట్టేల లింగం, శ్రీను, యాదయ్య, నర్సింలు, నవీన్ తదితరులు ఉన్నారు.

# వ్యోమగాముల ధైర్యానికి సెల్యూట్

## -తల్లోజు ఆచారి





**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వ్యోమగాములు సునీతా విలియమ్స్, విల్మోర్ తమ 9 నెలల అంతరిక్ష ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి భూమికి చేరుకున్న సందర్భంలో బిజెపి జాతీయ నేత, బీసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వారి అచంచల ధైర్యం మరియు సమష్టి కృషి మానవ సంకల్పానికి గొప్ప ఉదాహరణ. అంతరిక్షంలో గడిపిన సమయం వారికి మార్గదర్శకంగా నిలిచింది" అని కొనియాడారు. తద్వారా సాంకేతిక రంగంలో విశేషం సాధించిన ప్రతి ఒక్కరినీ అభినందించిన ఆచారి గారు, వారి శక్తి సామర్థ్యాలకు మరియు విజ్ఞానానికి సెల్యూట్ చేశారు. వ్యోమగాముల కృషి భవిష్యత్ పౌరసాంకేతిక విజ్ఞానానికి పునాది వేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# కుంట హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత అద్దాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్నగర్ కుంట ప్రభుత్వ పాఠశాల లోని విద్యార్థులకు షాద్నగర్ శాసనసభ్యులు శ్రీ వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన అద్దాలను అందజేశారు. షాద్నగర్ డివిజన్లో గత నెలలో ఆర్ బి ఎస్ కే టీముల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కంటిచూపు లోపం ఉన్న వాళ్లను గుర్తించి, వారికి ఆప్తాల్మిక్ డాక్టర్ల ద్వారా పరీక్షలు నిర్వహించి, ఒక్కో విద్యార్థి యొక్క రీడింగ్స్ను గుర్తించి, తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరిగింది అని షాద్నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి తెలియజేశారు. తదుపరి షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు పరీక్షలు ఉన్నందువలన , విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడకూడదు అనే ఉద్దేశంతో, కంటి చూపు లోపం ఉన్న విద్యార్థులకు అందరికీ, తెలంగాణ ప్రభుత్వము విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉద్దేశంతో మంచి అద్దాలను పంపిణీ చేస్తుందని, షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య మరియు వైద్యం కోసం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని షాద్నగర్ శాసనసభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం మెన్ హెచ్ ఓ డాక్టర్ వి విజయలక్ష్మి , ఆర్ బి ఎస్ కే వైద్యులు రాగిణి మరియు విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ జై శ్రీనివాసులు, ఎం పి హెచ్ ఈ ఓ లు శ్రావణ్ కుమార్, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, ఆర్ బి ఎస్ కే టీ మెంబర్లు లోకనాథ్, అన్నపూర్ణ, జ్యోతి, సునీత, మరియు కుంట ఐస్ క్రీం హెడ్మాస్టర్ భాగ్యమ్మ, ఉపాధ్యాయులు చెన్నారెడ్డి, శ్రీనివాసులు , వెంకటయ్య, మరియు మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ , తిరుపతిరెడ్డి, చెన్నయ్య, విజయ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, మరియు స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ జెండా దిమ్మె ధ్వంసానికి ప్రయత్నం

- ఫరూక్ నగర్ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఘటన
-జెండా ఇనుప పైపును విరగొట్టేందుకు ప్రయత్నించిన గుర్తు తెలియని వ్యక్తులు
-పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపిన స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు



**షాద్ నగర్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్ నగర్ మున్సిపాలిటీ ఫరూఖ్ నగర్ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెను, ఇనుప పైపును ధ్వంసం చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ప్రయత్నించారు. దిమ్మెపై ఉన్న ఇనుప పైపును వంచి వేశారు. విషయాన్ని గమనించిన స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే పార్టీ దిమ్మెను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దిమ్మె పక్కనే మరో రెండు పార్టీ ల జెండా దిమ్మె ఉన్నప్పటికి కేవలం బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెను, ఇనుప పైపును తొలగించేందుకు ప్రయత్నించాలని ఆరోపించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు..

# ఏప్రిల్ 2న కడ్తాల మండలానికి హరీష్ రావు రాక

## చరికొండ, ముద్విన్ గ్రామాలలో పర్యటన



**కడ్తాల్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఏప్రిల్ 2వ తేదీన కడ్తాల్ మండల కేంద్రంలో మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పర్యటించనున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ జెడ్పిటిసి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జర్పుల దశరథ నాయక్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని ఆయన నివాస గృహంలో వారు హరీష్ రావును కలుసుకున్నారు. ఏప్రిల్ 2న చరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయిన్ గుట్ట తండాలో సేవాలాల్ మహారాజ్ మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ముద్విన్ గ్రామపంచాయతీలో ఒక పేద కుటుంబానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్మించబడిన నూతన గృహాన్ని ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు. హరీష్ రావును కలిసిన వారిలో మాజీ సర్పంచ్ నరసింహ, మాజీ ఉపసర్పంచ్ నరేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగయ్య, నరేష్, సాబీర్, అంజి, గోపాల్, వెంకటయ్య పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**కడ్తాల,మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన గుర్క కృష్ణ తండ్రి గుర్క లాలయ్య కు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 54 వేల రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ చెక్కులను కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా చల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా సురేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా సురేందర్ రెడ్డి, గ్రామం మాజీ సర్పంచ్ నాయిని నరేందర్, పిసిసి మెంబర్ శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ తదితరులు పాల్గొన్నారు

# చారిత్రాత్మక బిల్లులకు ఆమోదం తెలిపిన ప్రభుత్వానికి యాదవ మహాసభ కృతజ్ఞతలు



**నల్గొండ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీసీ, ఎస్సీ వర్గాల సంక్షేమానికి చారిత్రాత్మకమైన బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన తెలంగాణ ప్రభుత్వానికి అఖిల భారత యాదవ మహాసభ నల్గొండ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టడం హర్షణీయమని, అలాగే ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం చారిత్రాత్మక పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మంత్రుల బృందం, ఎంఎల్ఏలు, ఎంఎల్సీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాక, శాసనసభ మరియు శాసన మండలిలో ఈ బిల్లులకు రాజకీయాలకు అతీతంగా సంపూర్ణ మద్దతు తెలిపిన టిఆర్ఎస్, బిజెపి, సిపిఐ, ఎంఐఎం, సీపీఎం వంటి అన్ని పార్టీల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# పేదలవి కాదు..పెద్దల ఇళ్లు కూల్చండి

## హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైడ్రాపై తెలంగాణ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కేవలం పేదల ఇళ్లే కాకుండా పెద్దలవి కూడా కూల్చాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. పెద్దల భవనాలను కూల్చినప్పుడే ప్రభుత్వ భూములను రక్షించినట్లు అవుతుందని పేర్కొంది. మీరాలం ట్యాంకు పరిసరాల్లో ఇళ్ల యజమానులకు రాజేంద్రనగర్ తహసీల్దార్ ఇచ్చిన నోటీ-సులపై హైకోర్టులో పిటిషన్ చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం.. దుర్గం చెరువు, మియాపూర్ చెరువుల్లోని ఆక్రమణలను ఎందుకు తొలగించడం లేదని హైడ్రాను ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. చెరువుల పరిరక్షణ మంచి విషయమే అయినా చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తెలిపింది.

# దాహార్తిని తీరుస్తూ సేవకుడిగా నిలుస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎండలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతుండగా, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు చల్లటి రాగి అంబలి అందిస్తూ, దాహార్తిని తీర్చడమే కాకుండా, వారి మానసిక ఆవేదనకు ఉపశమనం కలిగిస్తున్నారు. ఈ వినూత్న సేవ ప్రజల హృదయాలను గెలుచుకుంటోంది. అంబలితో దాహం తీర్చుకుని శాంతిగా స్వేదం తుడుచుకుంటున్న ప్రజలు, తమ నేతను అభినందిస్తూ, కడుపు సల్లంగా ఉండాలని దీవిస్తున్నారు. "మా ఎమ్మెల్యే అందించే ఈ చల్లటి సేవా కార్యక్రమం మాత్రమే కాదు, ప్రజలకు అందించే అన్ని విధాలా మద్దతు ఆయన గొప్పతనానికి నిదర్శనం," అని ప్రజలు కొనియాడుతున్నారు.
ఈ సేవా కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువవుతూ, నిత్యం వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి.

# ప్రతి విద్యాసంస్థల్లో పౌష్టికాహారం అందించడమే ఫుడ్ కమిషన్ లక్ష్యం





రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**కడ్తాల్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విద్యార్థిని విద్యార్థులు ప్రజలకు అందించే ఆహార భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని వారి హక్కు వారికే దక్కాలని ఆ దిశగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ దృష్టి సారిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల మండల కేంద్రంలోని ప్రభుత్వ అంగన్వాడి సెంటర్, చౌక ధార దుకాణం, కస్తూర్బా గాంధీ పాఠశాల, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర వసతి గృహాన్ని చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఫుడ్ కమిషన్ సభ్యులు గోవర్ధన్ రెడ్డి, ఆనంద్, జ్యోతి జిల్లా ఉన్నతాధికారులు మండల అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంగన్వాడి సెంటర్, చౌకదార దుకాణాన్ని తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో అంగన్వాడి సెంటర్ లో విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్న గుడ్డు సైజు చిన్నగా ఉండడంపై సిడిపిఓ అంగన్వాడి కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్ పిలిపించి గుడ్డు సైజు పెంచే విధంగా చూడాలని లేనియెడల అతని కాంట్రాక్టు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ కు సిఫార్సు చేస్తానని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అక్కడి నుండి కడ్తాల్ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం వంటశాల గదిని పరిశీలించి అక్కడి ఆహార పదార్థాలను బియ్యం తదితర వస్తువులను తనిఖీ చేశారు అక్కడ కూడా విద్యార్థినీలకు అందించే గుడ్డు సైజు చిన్నగా ఉండటంపై ఆయన అధికారులను సున్నితంగా మందలించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని వెంటనే మంచినీటి ఎద్దడి తీర్చాలని కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు. కేజీబీవీ పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో సీసీ కి సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల క్లాస్ రూమ్ లోకి వెళ్లి వారితో ఆహార భద్రత చట్టం గురించి వివరించి వారి వద్ద నుంచి సమాధానాలు రాబట్టారు.. ఈ సందర్భంగా విద్యార్థినీలు పాఠశాలలో రెండు నెలలుగా ఏఎన్ఎం లేక ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అదే విధంగా పిఈటి, ఫిజిక్స్ టీచర్ లేరని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డించారు.

ఈ సందర్భంగా గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు తనిఖీ చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఎవరు తనిఖీ చేయడం లేదని ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గొలి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2013 ఆహార భద్రత చట్ట ప్రకారం ప్రతి ఒక్కరికి ఆహారం అనేది వారి హక్కు అని వారి హక్కును హరించితే కఠిన చర్యలు తప్పవని కమిషన్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్ఓ శ్రీనివాస్ గుప్తా, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, డిటిడిఓ రమాదేవి, తహసిల్దార్ ముంతాజ్ బేగం, ఎంపీడీవో సుజాత, సిడిపిఓ శాంతి రేఖ, ఎంఈఓ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు జంగయ్య, సివిల్ సప్లై డీటీలు వెంకట భాను ప్రసాద్, వినోద్, డిఎం గోపికృష్ణ, ఏటిడిఓ వెంకటయ్య, కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్ అనిత, ఆశ్రమ పాఠశాల వార్డెన్ రాములు, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-అంకెల గారడి తప్ప ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ కాదు...!

-మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్...



**కడ్తాల్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలకు కేరాఫ్ అడ్రస్ అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన ప్రకటనలో పేర్కొంటూ అధికారం కోసం 420 హామీలను ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని ఆయన దుయ్యబట్టారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో బీసీ సంక్షేమానికి రూ. 9,000 కోట్ల బడ్జెట్ లో ప్రవేశపెట్టి పైసా ఖర్చు చేయకుండానే 2025- 26 ఆర్థిక సంవత్సరంలో బీసీ సంక్షేమం కోసం11 వేల కోట్లను బడ్జెట్లో పెట్టామన్నడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడి తప్ప ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్ ఏమాత్రం లేదని ఆయన పేర్కొన్నారు. అమలు గాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు సభలో ప్రభుత్వం వద్ద నిధులు లేవు అనడం విడ్డూరమని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్లో రైతులకు వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చిన విధంగా బడ్జెట్ ఉందని జైపాల్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నో రైతు ప్రజా సంక్షేమ పథకాలకు మంగళం పాడి నేడు రైతుబంధు దళిత బంధు, ముదిరాజ్ లకు చేప పిల్లల పంపిణీ, రాజకులకు ఉచిత కరెంటు, గొర్రెల పంపిణీ, రంజాన్ కిట్, బతుకమ్మ చీరల పంపిణీ పథకాలను విస్మరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన దుయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర సంక్షేమానికి కాకుండా ఢిల్లీ పెద్దలకు డబ్బు సంచులను మోసే గులాం గిరి బడ్జెట్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి కమిషన్ల కోసం పనిచేస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్ తో పాటు పరిసర ప్రాంతాల్లో బీద బడుగు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దని అన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన విపత్తు అయిన ఎస్ ఎల్ బి సి ఘటన గురించి అసెంబ్లీలో చర్చించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయఖ్ అలీ, గుర్క రాజేందర్ ఉన్నారు.

# మందకృష్ణ మాదిగ కు పాలాభిషేకం

**దేవరకొండ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ నియోజకవర్గం లోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సందర్భంగా పద్మశ్రీ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగా గారికి పాలతో పాలాభిషేకం చేయడం జరిగింది, అనంతరం స్వీట్స్ తింటూ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు మారుపాక గోపాల్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ నల్ల శ్రీకాంత్ జాంభవ్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ లేకుంటే ఎస్సీ వర్గీకరణ పోరాటం లేదని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందడం ద్వారా 70 ఏళ్ల మాదిగల కల నెరవేరిందని డా.అంబేద్కర్ దళితులకు రిజర్వేషన్లు అందిస్తే మంద



కృష్ణ మాదిగ ఆ రిజర్వేషన్లను దళితుల్లోని అన్ని కులాలకు అందిస్తున్నారని న్యాయమైన లక్ష్యం కోసం పోరాటం బలంగా చేస్తే ఏనాటికైనా విజయం వరిస్తుందని ఎమ్మార్పీఎస్ ఉద్యమం రుజువు చేస్తుందని మాదిగ అమరుల త్యాగాలు ఉద్యమం లక్ష్యం వైపు సాగేలా నడిపించాయని,అమరులకు జోహార్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం సహకరించిన అన్ని పార్టీలకు, సంఘాలకు కృతజ్ఞతలు ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ, మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం పట్లఎస్సీల్లో ఉపకులాల్ని మూడుగ్రూపులుగా విభజించి. 15 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుకల్పించిన ఆబిల్లుకు రాజకీయ పార్టీలకు అతీతంగా మద్దతిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన న్యాయమైందని. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నియోజవర్గ ప్రధాన కార్యదర్శి పల్లె అనిల్, మండల అధ్యక్షుడు రోహిత్, సైదులు, నాగేష్, సంతోష్, నరేష్ కుమార్, రాజు కుమార్, తదితరులు పాల్గొన్నారు..

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!


# నష్టపోయిన రైతుకు న్యాయం చేయాలి

– మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీను నాయక్



**దేవరకొండ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మర్రిచెట్టు తండా గ్రామంలో ఇటీవల జరిగిన ప్రమాదవశాత్తు మంటల కారణంగా బాణావత్ పాండు అనే రైతు గడ్డివాము, పైపులు, ఇతర వ్యవసాయ సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటన నిరుపేద కుటుంబానికి చెందిన పాండు కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ నేపథ్యంలో, నష్టపోయిన రైతును ఆదుకోవాలని కోరుతూ మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీను నాయక్, రైతులతో కలిసి దేవరకొండ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పాండు, బాలు, శత్రు తదితర రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని, పాండు కుటుంబానికి నష్టపరిహారం అందించాలని వినతిలో కోరారు. ఈ చర్య రైతుల జీవితాల్లో కొంత ఉపశమనం కలిగించగలదని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# హింగ్లా మాత ఆలయ నిర్మాణానికి రెండు లక్షల విరాళం ప్రకటించిన వడ్త్య రమేష్ నాయక్



**కొండమల్లేపల్లి, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొండమల్లేపల్లి మండలంలోని కొర్ర తండ గ్రామంలో నిర్మాణంలో ఉన్న హింగ్లా మాత ఆలయానికి దేవరకొండ నియోజకవర్గ నాయకుడు వడ్త్య రమేష్ నాయక్ రెండు లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఈ విరాళం ఆయన సమాజ సేవా దృక్పథాన్ని, ఆధ్యాత్మిక అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ, హింగ్లా మాత ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. హింగ్లా మాత ఆలయం గ్రామానికి ఆధ్యాత్మిక శక్తిని అందించడమే కాకుండా, ప్రాంతానికి ప్రత్యేకతను చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ఖండ్య నాయక్, గోపాల్ నాయక్, లక్కీరామ్, తుల్సీరామ్ వంటి గ్రామ పెద్దలు, యువ నాయకులు చైతన్య నాయక్, కొర్ర నాగరాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆలయ నిర్మాణం గ్రామ సమైక్యతకు, సాంస్కృతిక గౌరవానికి చిహ్నంగా నిలుస్తుందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు పై హర్షం



**కడ్తాల్,మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ కార్యాలయంలో పాడిపెంటయ్య ఆధ్వర్యంలో ముఖ్యమైన సమావేశం జరిగింది. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మంత్రివర్గ ఆమోదం పొందినందుకు గాను, అలాగే రాజు యువ వికాసం కింద ?6,000 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకులు, తాలూకా చైర్మన్లు, మండల అధ్యక్షులు, మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కడ్తాల ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పోతు గట్టి అశోక్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# నేడు ఎమ్మెల్యే పర్యటన



**చింతపల్లి, మార్చి 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
నేడు చింతపల్లి మండలంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పర్యటన
ఉదయం 10.00గంటలకు కిష్టరాయిని పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
ఉదయం 11.00గంటలకు P.K. మల్లేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
మధ్యాహ్నం 12.00గంటలకు M.మల్లేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
మధ్యాహ్నం 1.00గంటలకు తక్కెళ్ళపల్లి నుండి M .మల్లేపల్లి వరకు 4కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు తక్కెళ్లపల్లి గ్రామంలో శంఖుస్థాపన చేస్తారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఉప సర్పంచ్ జీ. జోసఫ్




**ఇబ్రహీంపట్నం,మార్చి 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాచారం మండల పరిధిలోని కుర్మిద్దలో మాజీ ఉప సర్పంచ్ జీ. జోసఫ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా చాలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు . ప్రధాన సెంటర్లో అనేక మంది బాటచారులకు, ప్రయాణికులకు దాహాన్ని తీర్చేందుకు ఈసేవ వెలకట్టలేనిదని అన్నారు. తన సహాయ సహకారాలు గ్రామ ప్రజలకు నిరంతరము అందజేస్తామని తెలిపారు. ఆనంతరం గ్రామములో చలివేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా గ్రామ యువకులు జోసఫ్ ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి మహేష్, గ్రామ యువకులు, ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భట్టి వారి మాట.. బంగారు బాట..

-లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కు ఉపముఖ్యమంత్రి "సై"..
-"ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్" కృషికి తగిన ఫలితం..
-రూ.266.65 కోట్లు పాలనాపరమైన అనుమతి
-షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గిరిజన కోఆర్డినేటర్ పి. రఘు నాయక్



**షాద్ నగర్,మార్చి 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
లక్ష్మి దేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రభుత్వం సత్వరం చేపడుతుందనీ, మూసీ ప్రాజెక్టు పరిధిలోని బునాదిగాని కాలువ పునరుద్ధరణ పనులకు రెండు వందల అరవై ఆరు కోట్ల అరవై ఐదు లక్షల రూపాయలతో (266.65 కోట్లు) పాలనాపరమైన అనుమతి ఇవ్వడం జరిగిందని షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గిరిజన కోఆర్డినేటర్ పి. రఘు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి మేరకు లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అంగీకారాన్ని తెలిపారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గిరిజన, ఆదివాసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ పి. రఘు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన కృషిని అభినందించారు. సాగు నీటి ప్రాజెక్టులు ఇవ్వాలన్న, రైతులకు మేలు చేయాలన్నది కాంగ్రెస్ వల్లనే సాధ్యమని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వం లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుర్చీ వేసుకుని ప్రాజెక్టు కడతానని రైతులను మోసం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గ రైతులకు సాగునీటి ఇబ్బందుల నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక పాలమూరు ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ రావడం తమకు ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గత పది ఏళ్లలో ఈనాడు బడ్జెట్లో కెసిఆర్ ప్రభుత్వం లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణం పై నయా పైసా కూడా కేటాయించలేదని నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న మహాతరమైన నిర్ణయం హర్షనీయమని వారు పేర్కొన్నారు. ననీటిపారుదల శాఖకి ఈ బడ్జెట్ లో 23,373 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పడం హర్షనీయమని అన్నారు. షాద్ నగర్ రాజకీయ చరిత్రలోనే ఇదో సరికొత్త రికార్డు అని వారు కొనియాడారు. గత ఎన్నికల్లో హామీ ఇవ్వడమే కాకుండా ఏడాదిన్నర పాలనలో పాలనాపరమైన అనుమతులు ప్రభుత్వం ఇవ్వడం శుభ సూచకమని అన్నారు.

## సంపాదకీయం

# పరీక్ష హాల్లో టాపర్ల విజయ మంత్రం!

పరీక్ష అనేది కేవలం చదువుకున్న విషయాలను పరీక్షించే సాధనం మాత్రమే కాదుబీ ఇది మన మనస్తత్వాన్ని, ప్రణాళికాబద్ధమైన ఆలోచనను, మానసిక స్థైర్యాన్ని కూడా పరీక్షిస్తుంది. మంచి మార్కులు సాధించాలంటే కష్టపడి చదవడం మాత్రమే కాదు, పరీక్ష సమయంలో సరైన వ్యూహాలు, మైండ్ హ్యాక్స్ ఉపయోగించడం చాలా అవసరం.
అందుకే, టాపర్లు పరీక్ష హాల్లో అనుసరించే విజయ రహస్యాలు ఏంటో తెలుసుకుని, మీకు కూడా అవి ఉపయోగపడేలా చేసుకోండి! ?

**1. పరీక్ష భయాన్ని తగ్గించే "పామింగ్ టెక్నిక్"**
ఎంతో మంది విద్యార్థులకు పరీక్ష హాల్లో అడుగు పెట్టగానే గుండె వేగంగా కొట్టుకోవడం, చెమట పట్టడం, లేదా మెదడు ఖాళీ అయినట్లు అనిపించడం జరుగుతుంది. దీని కారణం, సింపతటిక్ నర్వస్ సిస్టమ్ (Sympathetic Nervous System) అధికంగా యాక్టివ్ కావడం.
దీన్ని తగ్గించేందుకు "పామింగ్ టెక్నిక్" అద్భుతంగా పని చేస్తుంది.

**ఈ టెక్నిక్ ఎలా చేయాలి?**
- రెండు చేతులను రుద్ది వేడిగా చేయండి.
-కళ్లు మూసుకుని, వేడిగా ఉన్న చేతులను కళ్ల మీద ఉంచండి.
-లోతుగా ఊపిరి తీసుకుంటూ, "నేను ప్రశాంతంగా ఉన్నాను" అని మౌనంగా చెప్పుకోండి.
-30 సెకన్ల పాటు అలాగే ఉంచిన తర్వాత చేతులను వదిలి నెమ్మదిగా గాలి పీల్చుకోండి.

**-దీని ప్రయోజనాలు:**
-నాడీ వ్యవస్థ రిలాక్స్ అవుతుంది.
-మెదడు ప్రశాంతంగా మారి స్పష్టమైన ఆలోచన (Clear Thinking) మోడ్‌లోకి మారుతుంది.
- ప్రశ్నలను స్పష్టంగా అర్థం చేసుకుని సమాధానం రాయగలుగుతారు.

**2. మైండ్ బ్లాక్ అయినా టెన్షన్ పడొద్దు! ( GSR మోడల్) ???**
పరీక్ష రాస్తూ మధ్యలో ఒక్కసారిగా చదివినవేవీ గుర్తుకు రాకపోవడం అనుభవించారా?
ఇది మీ ఒత్తిడిని పెంచి సమయాన్ని వృథా చేస్తుంది. టాపర్లు దీని నుంచి బయటపడటానికి " GSR మోడల్" అనే వ్యూహాన్ని ఉపయోగిస్తారు.
GSR మోడల్ - 3 సులభమైన స్టెప్స్
- G - Ground Yourself : కాళ్లు నేలకి ఆనించి 5 సెకన్ల పాటు లోతుగా ఊపిరి తీసుకోండి.
- S - Switch Focus : 10 సెకన్ల పాటు కళ్ళు మూసుకుని ప్రశాంతంగా ఉండండి.
- R - Restart Slowly : ప్రశ్నను మళ్లీ నెమ్మదిగా చదవండి.

**దీని ప్రయోజనాలు:**



- మెదడు రీసెట్ అవుతుంది.
- మళ్లీ ప్రశాంతంగా ఆలోచించగలుగుతారు.
- మైండ్ బ్లాక్ అవ్వకుండా ఉత్తమ సమాధానాలను రాయగలుగుతారు.

**3. పరీక్ష హాల్లో "గౌనర్-స్విచ్ మోడల్"**
పరీక్ష సమయంలో కొన్ని ప్రశ్నలు అర్థం కాకపోతే, మన మెదడు "బ్రెయిన్ ఫ్రీజ్" ( Brain Freeze ) అవుతుంది.
ఇది సమయాన్ని వృథా చేయడమే కాకుండా, మన ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది. దీన్ని అధిగమించేందుకు "గౌనర్-స్విచ్ మోడల్" ఉపయోగించాలి.

**ఈ వ్యూహం ఎలా పని చేస్తుంది?**
-గౌనర్ మోడ్ (Observe ): ప్రశ్న అర్థం కాకపోతే, ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా కూర్చొని అక్షరాలను గమనించండి.
- స్విచ్ మోడ్ (Change): ప్రశ్నను పూర్తిగా వదిలేయకుండా, కొంతసేపు ఆలోచించి మళ్లీ నెమ్మదిగా చదవండి.
-స్కానింగ్ మోడ్ ( Scan ): పక్కనే ఉన్న ఇతర ప్రశ్నలను చూసి, మైండ్‌ను మళ్లీ సెట్ చేసుకోండి.

**దీని ప్రయోజనాలు:**
మెదడు బ్రెయిన్ ఫ్రీజ్ నుంచి బయటపడుతుంది.
ప్రశ్నను నిశితంగా పరిశీలించి సరైన సమాధానం రాయగలుగుతారు.

**4. చివరి నిమిషాల్లో పాటించాల్సిన వ్యూహాలు**
పరీక్ష పత్రం అందుకున్న వెంటనే, 2 నిమిషాలు ప్రశాంతంగా ప్లాన్ చేసుకోండి.
అధిక మార్కులు వచ్చే ప్రశ్నలను ముందుగా రాయడం ప్రారంభించండి.
ప్రతి 15-20 నిమిషాలకు చిన్న బ్రేక్ తీసుకుని మైండ్ రిఫ్రెష్ చేసుకోండి.
డయాగ్రామ్స్, హైలైట్స్, ముఖ్యమైన పాయింట్లు ఉపయోగించండి
- ఇవి సమాధానాలను ఆకర్షణీయంగా చేస్తాయి.
గుర్తుకు రాని ప్రశ్నలను చివరి 15 నిమిషాల్లో మళ్లీ ప్రయత్నించండి.

**5. పరీక్ష హాల్లో చేయకూడని తప్పిదాలు**
-గడియారం చూస్తూ టెన్షన్ పెంచుకోవడం.
-ఒక్క ప్రశ్నకే అతుక్కుపోయి ఎక్కువ సమయం వృథా చేయడం.
-"నేను తక్కువ మార్కులు తెచ్చుకుంటానేమో" అని భయపడడం.
- ఇతర విద్యార్థులు త్వరగా పూర్తి చేస్తున్నారని ఒత్తిడికి లోనవడం.

**6. టాపర్ల సీక్రెట్ టిప్స్!**
-"టైమ్ బ్లాకింగ్" టెక్నిక్: ఒక్కో సెక్షన్‌కు సమయం కేటాయించుకుని, దాని ప్రకారం ముందుకు సాగండి.
- "మెమరీ అన్కరింగ్" టెక్నిక్: పాఠ్యాంశాలను గుర్తుంచుకోవడానికి చిన్న ట్రిక్స్ ( mnemonics ) ఉపయోగించండి.
- "ఆటిట్యూడ్ మ్యాటర్స్" - పరీక్షను ఓ ఛాలెంజ్‌గా తీసుకుని ఆత్మవిశ్వాసంతో రాయండి!

**ముగింపు**
పరీక్ష అనేది కేవలం చదివిన విషయాలను పరీక్షించేది కాదు, మీ ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని, ప్రణాళికను పరీక్షించే మానసిక పరీక్ష!
మీరు ఒత్తిడిని తగ్గించుకుని, సరైన వ్యూహాలను అమలు చేస్తే, శ్రేష్ఠమైన మార్కులు మీ సొంతం!
పరీక్ష అనేది ఒక వ్యూహాత్మక గేమ్! దీన్ని గెలవడం మీ చేతుల్లోనే ఉంది!

వ్యాసకర్త
చెరుకు జంగయ్య గౌడ



# దేశ చరిత్రలో బిసి బిల్లు విప్లవాత్మకం





**-ఎస్సీవర్గీకరణ చరిత్రాత్మకం**
**-ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్**
**-సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం**
**-టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్లు,మార్చి 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు మరియు ఎస్సీ వర్గీకరణ బిల్లులను ఆమోదించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి పునాది వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బీసీ కులగణన చేసి, 42 శాతంవిద్య, ఉద్యోగ, ఉపాధి, స్థానిక సంస్థల రిజర్వేషన్లను కల్పించేందుకు బిల్లు ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్ అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పతనమని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం అనంతరం ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, పార్లమెంటు సభ్యులు మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే వంశీ చందు రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్లమల్ల జగన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కాంత్ గౌడ్, తాలూకా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దళపతి గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, మాజీ ఎంపీపీ దావా దానంజయ, మాజీ సర్పంచ్ పర్వతలు, ఖలీల్, ఖాదర్, ఫరీద్, కాలే మల్లయ్య, మైసయ్య, వెంకట్ రెడ్డి, రాఘవేందర్, అలీం, శంకర్, మహేష్, విజయ్ శంకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నిర్ణయాలు దేశ చరిత్రలోనే విప్లవాత్మకమని, బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాల్సిన బాధ్యత బీజేపీ మరియు ఇతర రాజకీయ పార్టీలపై ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, ఈ సంబరాలను గ్రామస్థాయిలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

# రంగారెడ్డి జిల్లాలో ఎంఎస్ఎం ఈ రుణాల ప్రాధాన్యతపై కలెక్టర్ దిశానిర్దేశం

**రంగారెడ్డి, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లాలో చిన్న వ్యాపారాలు, మధ్యతరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉండడం వల్ల, వాటిని ప్రోత్సహించేందుకు సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ద్వారా మరింత రుణాల మంజూరు చేయాల్సిన అవసరాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలియజేశారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో, ఖరీఫ్, రబీ సీజన్లకు కేటాయించిన రుణాల లక్ష్యాలను, అవి సాధించిన ప్రగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రానున్న సీజన్లలో రైతులకు పంట రుణాలు చేర్చడం, రుణ పంపిణీ లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. పంట రుణాల విషయంలో కొన్ని బ్యాంకులు లక్ష్యాలకు తగ్గట్టుగా రుణాల మంజూరు చేయడంలో వెనుకబడ్డాయనీ, దీన్ని అధిగమించాలని ఆయన పిలుపునిచ్చారు. సామాజిక సంక్షేమానికి బ్యాంకుల పాత్ర కలెక్టర్ నారాయణ రెడ్డి స్వయం




ఉపాధి లక్ష్యాలను చేరుకోవడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని వివరించారు. స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలను సకాలంలో అందించడంతో పాటు, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యాన్ని నివారించేందుకు బ్యాంకులు కృషి చేయాలని కోరారు. రుణాల ద్వారా ఏర్పాటు చేసిన యూనిట్ల స్థితిగతులపై పర్యవేక్షణ నిర్వహించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని గుర్తుచేశారు.
పంట రుణాల పై ప్రత్యేక దృష్టి రైతులు మనీ లెండర్ల వద్ద పడ్డ ఇబ్బందులను తొలగించేందుకు, బ్యాంకులు పంట రుణాలను సమయానికి అందించాలి. ఇందుకోసం ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం పని చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీదేవి సూచించారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కుసుమ, నాబార్డు ఏజీఎం, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహ రావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీలత, మెప్మా పీడీ మల్లీశ్వరి మరియు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రకటనలు కలెక్టర్ పిలుపు మేరకు, రంగారెడ్డి జిల్లాలో ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు మరింత మద్దతు అందించేందుకు త్వరితగతిన కార్యచరణ చేపట్టాలని బ్యాంకర్లను ఆదేశించారు. విద్యారుణాలు, గృహనిర్మాణ రుణాలు తదితర అంశాల్లో బ్యాంకులు తమ లక్ష్యాలను సాధించాలని, స్వయం ఉపాధి కల్పించే పథకాలను వేగవంతం చేయాలని సూచించారు.

## నేను రాను బిడ్డా సర్కారు దవఖానకు..



**కల్వకుర్తి, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలో గవర్నమెంట్ హాస్పిటల్లో డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నిండు గర్భిణీ మృతిపట్ల కల్వకుర్తి మాజీ మంత్రివర్యులు చిత్తరంజన్ దాస్ వారు మాట్లాడుతూ .. తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శ్యామల నిండు గర్భిని మృతి కి కారణం కల్వకుర్తి ప్రభుత్వ హాస్పిటల్ డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఆమె చనిపోయిందని ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యా అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు .. ప్రభుత్వ హాస్పిటల్ లో పనిచేసే డాక్టర్లే ప్రైవేట్ హాస్పిటల్లో నిర్వహిస్తూ . పేషెంట్లకు భయాందోళనకు గురిచేసి ప్రైవేట్ హాస్పిటల్ పంపించుకుంటూ కమిషన్ల కోసం కక్కుర్తి పడి ప్రైవేట్ హాస్పిటల్ అధిక మొత్తంలో ఫీజులు తీసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు అని వారు మండి పడ్డారు . మృతి చెందిన శ్యామల కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారం , ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్ల, నర్సులపై వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం నాయకులు B ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన శ్యామల భర్తకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, నిజ నిర్ధారణ కమిటీ వేయాలని , ప్రభుత్వ డాక్టర్లు సమయపాలన పాటించాలని అందరికి అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, మాజీ సర్పంచ్ నిరజన్ గౌడ్, బిజెపి నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి , పట్టణ అధ్యక్షులు బాబీ దేవ్ మరియు ఇతరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



**తలకొండపల్లి, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తలకొండపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బీసీలకు 42% రిజర్వేషన్ ఆమోదం మరియు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపినందుకు ఆయన చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డి. ప్రభాకర్ రెడ్డి, కిసాన్ సేల్ రాష్ట్ర కార్యదర్శి డి. మోహన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి డిగ్రీ కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, సీనియర్ నాయకులు రేణు రెడ్డి, చిత్త రంజన్, బొళ్ళ యాదగిరి, ముదిరాజ్ పాండు రమేష్, ఇటమోని మల్లేష్, యాదవ్ రాజేందర్, నాయక్ నరసింహారెడ్డి, ఆంజనేయులు, సురేష్, శేఖర్, వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు



**కల్వకుర్తి, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి బుధవారం రోజు 7 పరీక్షకేంద్రాల్లో 1548 విద్యార్థుల గాను 1475 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు, 73 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినారని ఎగ్జామ్స్ చీఫ్ సూపరిడెంటెంట్ బి.రామ్ రెడ్డి తెలిపారు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని విద్యార్థులు కేరింతలు కొడుతూ సంతోషపడ్డారు.

# బీసీల కృతజ్ఞతా ర్యాలీ




నాగర్ కర్నూల్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బీసీ ఉద్యోగ,ఉపాధ్యాయ విద్యావంతులు, ప్రజా సంఘాలు మరియు కుల సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా,ఉద్యోగ మరియు స్థానిక సంస్థల రాజకీయ అవకాశాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ మేధావులు, ప్రజా సంఘాలు, మరియు కుల సంఘాలు ముక్తకంఠంగా రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినటువంటి బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం,అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు భాస్కర్, వెంకటయ్య, ఉద్యోగ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రాజు గౌడ్, విద్యావంతుల వేదిక అధ్యక్షులు ఎం శివశంకర్ యాదవ్, బిసి విద్యార్థి సంఘ అధ్యక్షులు అరవింద చారి, బిసి లాయర్స్ ఫోరం అధ్యక్షులు ఎం శేఖరయ్యగారు, సగర సంగం జిల్లా అధ్యక్షులు గట్టు శ్రీనివాసులు, చిలుక పార్వతయ్య, గౌడ ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్ జిల్లా అధ్యక్షులు సంజీవయ్య గౌడ్, వివిధ బీసీ కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు వెంకటయ్య గౌడ్ చేయూత



**వెల్దండ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ తన కార్యకర్తలు మరియు సమాజానికి అండగా నిలుస్తూ మరోసారి తన నిబద్ధతను చాటుకుంది. వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆపద సమయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కాంగ్రెస్ కార్యకర్త బాదేపల్లి అరుణ్ ముదిరాజ్ కుటుంబానికి, ఆయన తండ్రి బాదేపల్లి నిరంజన్ వైద్య ఖర్చుల నిమిత్తం ?10,000 ఆర్థిక సాయం అందించారు. అలాగే, వెల్దండ గ్రామానికి చెందిన మారేపల్లి అలివేలుకు అనారోగ్య సమస్యలతో వైద్య ఖర్చుల కోసం ?5,000 అందజేశారు. ఈ సందర్భంగా మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తన కార్యకర్తలు మరియు పేద ప్రజలకు అండగా ఉంటుందని, వారి ఆపద సమయాల్లో సహాయం అందిస్తుందని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు భరోసా కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిమ్మూల తిరుపతిరెడ్డి, ఎండి రషీద్, గుద్దేటి కిష్టాలు, పుట్టా యాదయ్య, మారేపల్లి శ్రీను, బాదేపల్లి రామకృష్ణ, తుంగా మల్లేష్, బసవోని వెంకటయ్య, అన్యపు రామస్వామి, బసవోని చంద్రయ్య, రేవెల్లి దర్గయ్య, మట్ట భరత్, పుట్ట శివ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి జ్ఞాపకార్థం జామెట్రీ బాక్సులు, పెన్నుల పంపిణీ




**కల్వకుర్తి, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి మండల కేంద్రంలోని తాండ్ర గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తాండ్ర గ్రామానికి చెందిన కేతమళ్ళ అనిల్ తండ్రి కీర్తిశేషులు చిన్న హుస్సేన్ జ్ఞాపకార్థం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, పదవ తరగతి పరీక్షలకు అవసరమైన జామెట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, స్కూల్ రబ్బర్లు విద్యార్థులకు అందజేశారు. అదేవిధంగా, ప్రతి విద్యా సంవత్సరం పదవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి 3,000 మరియు రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థికి 2,000 ప్రోత్సాహ బహుమతిగా అందిస్తామని ప్రకటించారు. కేతమళ్ళ అనిల్ విద్యార్థులకు మంచి చదువుతో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం



**వెల్దండ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సాగిన నిరంతర పోరాటం ఫలితంగా నిన్న అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వీరస్వామి, కాలువల జంగయ్య, కటిక రామస్వామి, పోలేరాజు మాట్లాడుతూ, ఈ నిర్ణయం 30 ఏళ్ల నిరంతర ప్రక్రియకు ఫుల్ స్టాప్ పెట్టిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల కల నెరవేరినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ, మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పూలమాలతో పాటు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గుద్దటి ప్రభాకర్, కొయ్యల పుల్లయ్య, బుద్ధుడి కిష్టాలు, ఏర్లపల్లి అని, దుబ్బ నాగేష్, కొప్పు గెలువయ్య, దాసరి లింగం, కొమ్ము అంజయ్య, ముదిగొండ రమేష్, గుద్దటి జనార్ధన్, ఈదులపల్లి శ్రీనివాసులు, జంగయ్య, జగదీశ్వర్, లక్ష్మణ్, ప్రకాశ్, తక్కెళ్ళపల్లి శేఖర్, వెంకటయ్య, మొగులయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెనంలో నుంచి పొయ్యిలో పడ్డ జనం

**బడ్జెట్ ఆరు గ్యారెంటీలను విస్మరించింది**
**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు**



**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అట్టహాసంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలు ఆశలు వదులుకునేలా పద్దుల రూపకల్పన జరిగిందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్‌పై కిషన్‌రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడీతో తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసిందన్నారు. పదేళ్లపాటు– భారాస రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అగాథంలోకి నెట్టేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు రాష్ట్రాన్ని పెనంపై నుంచి పొయ్యిలోకి పడేసినట్టు చేసింది. గతేడాది బడ్జెట్ పెట్టినప్పుడు తొలి ఏడాదే కదా అని తప్పించుకున్నారు. 15 నెలలు పాలించిన తర్వాత కూడా ఆరు గ్యారంటీ–లు, 420 వాగ్దానాల అమలును పూర్తిగా విస్మరించారు. వివిధ ప్రాజెక్టులకు భారీగా ప్రకటనలు చేసినా.. కేటాయింపులు, ఆచరణ శూన్యమని ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. అంకెల గారడీ ద్వారా మరోసారి తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిన బడ్జెట్ ఇది. ఎన్నికల హామీలపై ప్రజలు ఆశలు వదులుకోవాలని బడ్జెట్ నిరూపించింది. ప్రభుత్వ ఆదాయం, రాబడిపై కనీస అవగాహన లేకుండా అంచనాలు రూపొందించారు' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# బడ్జెట్ సమావేశంలో నిరుద్యోగులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వము

**కల్వకుర్తి,మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ యువతను నిరాశ పరిచిన రాష్ట్ర బడ్జెట్ నిరుద్యోగ మృతి జాబ్ క్యాలెండర్ యూత్ డిక్లరేషన్ హామీలను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వము మరియు శాసనసభలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో యువతను విస్మరించిందని డివైఎఫ్ఐ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు వి.సైదులు కార్యదర్శి బి శివ వర్మలు వివరించారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న యూత్ డిక్లరేషన్ లో భాగంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు కానీ ఈ బడ్జెట్లోనైనా నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు 4000 రూపాయల నిరుద్యోగ భృతి కి నిధులు కేటాయిస్తారేమోనని ఆశలు పెట్టుకున్నారు కానీ బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడ కూడా ఎన్నికల్లో ప్రధాన డిమాండ్ గా ఉన్న నిరుద్యోగ భృతి పదమే ఉసేత్తకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని పేర్కొన్నారు పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండర్ ప్రకటించి షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ వేయడం లేదన్నారు ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి కేవలం 57 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసి గొప్పలు చెప్పుకుంటుంది అన్నారు స్వయం ఉపాధి రుణాలు 6000 కోట్ల రూపాయలు



కేటాయిస్తామని చెప్పి అది కూడా ఐదు లక్షల మంది వరకే ఇస్తామని ప్రకటించారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత సుమారు 35 లక్షల మంది ఉన్నారు రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులో పేరు ఉంటేనే అర్హులు అని చెప్పడం సరైనది కాదన్నారు గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డు లేక చాలా మంది ఇబ్బందులు పడ్డారు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పటివరకు మంజూరు చేయలేదు రేషన్ కార్డు లింక్ పెట్టకుండా రాజీవ్ యువ వికాస పథకాన్ని అర్హులైన నిరుద్యోగులకు అందరికీ వర్తింపచేయాలి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి రంగానికి కేవలం 900 కోట్లు కేటాయించడం సరికాదన్నారు ప్రభుత్వం వెంటనే బడ్జెట్లో ను సవరించి నిరుద్యోగ యువత ఉపాధి ఉద్యోగ అవకాశాలకై రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ రేటును దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు ప్రకటనలకు ఇస్తున్న ప్రియార్టి.ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు మీద దృష్టి పెట్టడం లేదన్నారు అదేవిధంగా క్రీడ రంగానికి కేవలం 465 కోట్లు నిధులు సరిపోవని అన్నారు ప్రతి గ్రామంలో మండల నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్లో మాత్రం అందుకు అనుకూలంగా కేటాయింపులు చేయకపోవడం క్రీడాకారులను విమర్శించిదన్నారు అన్నారు యూత్ డిక్లరేషన్ హామీల ప్రస్తావనే లేకుండా బడ్జెట్ను ప్రవేశపెట్టారు గత ప్రభుత్వ మాదిరిగానే ఈ ప్రభుత్వం ప్రకటనకు పరిమితమవుతున్నది కాబట్టి యువతను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ వ్యతిరేకంగా రేపు జిల్లా వ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు గోరేటి శీను తెలిపారు.

# హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్ గ్లోబల్ ఆఫీస్

**2వేల మంది ఉద్యోగులతో ప్రారంభించేందుకు నిర్ణయం**
**తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం**
**సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఎంవోయూ**




**హైదరాబాద్, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ సంస్థ మెక్ డోనాల్డ్‌తో తెలంగాణ ప్రభుత్వం తో కీలక ఒప్పందం చేసుకుంది. సంస్థ విస్తరణలో భాగంగా మెక్ డోనాల్డ్ ఇండియా గ్లోబల్ ఆఫీస్ ను హైదరాబాద్ లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. త్వరలో 2,000 మంది ఉద్యోగులతో మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఇండియా ఆఫీసును నగరంలో ప్రారంభించనుంది. బుధవారం ఉదయం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెక్ డోనాల్డ్ ఛైర్మన్, సీఈవో క్రిస్ కెంప్జెన్స్కితో పాటు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తమ గ్లోబల్ ఆఫీస్ ఏర్పాటు–కు సంబంధించి మెక్ డోనాల్డ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పెట్టు–బడుల ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ హైదరాబాద్లో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ సెంటర్ తమ రాష్ట్రంలోనే స్థాపించాలని పలు రాష్ట్రాలు పోటీ పడుతున్న సందర్భంలో మెక్ డోనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టు–బడులకు గమ్యస్థానంగా ఎంచుకోవడం గర్వంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వివరించారు. సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ– సేవలు వినియోగించుకోవాలని సూచించారు. యూనివర్సిటీ–ని స్కిల్ జోన్ గా ఉపయోగించుకుని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్ లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్ లెట్లలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. మెక్ డోనాల్డ్‌కు అవసరమైన మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. దీంతో రైతుల ఆదాయం పెరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. బెంగళూరు లాంటి ఇతర సిటీలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతో పాటు– మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలున్నాయని మెక్ డోనాల్డ్ సీఈవో క్రిస్ కెంప్జెన్స్కి అన్నారు. అందుకే హైదరాబాద్ ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్ గా ఎంచుకున్నట్లు– చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మెక్ డోనాల్డ్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ– అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. తదుపరి సంప్రదింపులు, ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలోనూ ఇటు–వంటి కార్యక్రమాలను చేపడుతామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 38 మెక్ డోనాల్డ్ ఔట్‌లెట్లు– ఉన్నాయి. ప్రతి ఏడాది మరో 3 లేదా 4 కొత్త ఔట్‌లెట్లను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయి. కొత్తగా గ్లోబల్ ఇండియా ఆఫీసు ఏర్పాటు–తో రాష్ట్రంలోని యువతకు ప్రత్యక్షంగా పరోక్షంగా మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, మెక్ డోనాల్డ్ సీఈవోతో పాటు– గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై ఆండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండయా హెడ్ దేశాంత కైలా పాల్గొన్నారు.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

**92వేల మార్క్‌కు చేరుకున్న తులం బంగారం**

**న్యూఢిల్లీ, మార్చి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేశీయంగా బంగారం ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భారీ డిమాండ్ కారణంగా ఇటీవల రూ.90 వేల మార్కు దాటేసిన పసిడి.. తాజాగా దేశ రాజధాని దిల్లీలో రూ.92 వేల మార్కుకు చేరువైంది. 10 గ్రాముల స్వచ్ఛమైన ధర బుధవారం రూ.700 పెరిగి రూ.91,950కి చేరినట్లు– ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. వివాహాల సీజన్ కావడం దేశీయంగా బంగారానికి డిమాండ్ పెరిగినట్లు– పేర్కొంది. హైదరాబాద్‌లో 10 గ్రాముల ధర రూ.91,150 పలుకుతోందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకు తోడు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో వృద్ధి



నెమ్మదించడం కూడా పసిడివైపు పెట్టుబడులు మళ్లేందుకు దోహదం చేస్తున్నాయి. దీంతో అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ పెరిగింది. దిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర మంగళవారం రూ.91,250గా ఉండగా.. బుధవారం రూ.700 పెరిగి రూ.91,950కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం కూడా 10 గ్రాములు రూ.91,500 పలుకుతోంది. అటు– అంతర్జాతీయ మార్కెట్‌లోనూ స్పాట్ గోల్డ్ ఔన్సు 3039 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇంట్రాడేలో 3045 డాలర్లకు చేరింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ట్రంప్ అధికారంలోకి వచ్చాక నెలకొన్న వాణిజ్య భయాలు సురక్షిత పెట్టు–బడి సాధనంగా భావించి బంగారం పెట్టు–బడులపై మొగ్గు చూపుతున్నారని అబన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమి–టె–డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా తెలిపారు.



# వరుస సినిమాలతో స్పీడ్‌పెంచిన రితికాసింగ్



చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. విక్టరీ వెంకటేశ్ నటించిన గురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రితికా సింగ్. ఈ మూవీ తర్వాత అంతగా ఆఫర్స్ రాలేదు.. తెలుగులో పెద్దగా కనిపించక పోయినా తమిళ్ లో సినిమాలు చేస్తుంది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు తెలుగుతోపాటు తమిళం, మలయాళం చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంటుంది. గురు సినిమా తర్వాత తర్వాత విజయ్ సేతుపతితో కలిసి ఆండవన్ కట్టలై, అలాగే రాఘవ లారెన్స్ సరసన శివలింగ సినిమాల్లో నటించింది రితిక. ఈ రెండు చిత్రాలు కూడా హిట్ గా నిలిచాయి. గురు తర్వాత నేరుగా మరే తెలుగు సినిమాలోనూ నటించలేదు రితిక. కేవలం నీవెవ్వరో అనే సినిమాలో కనిపించింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా రజనీకాంత్ వెట్టయాన్ సినిమాలో నటించింది. వెట్టయాన్ చిత్రంలో కీలకపాత్ర పోషించింది. ఇందులో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ఆకట్టుకుందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే.. రితిక సోషల్ మీడియలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ చేసే వర్కౌట్లకు అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతుంటారు. అలాగే కొన్ని క్రేజీ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది ఈ వయ్యారి భామ. తాజాగా రితిక షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.

# కోర్టు మూవీలో అందరినీ ఆకట్టుకున్న ముద్దుగుమ్మ శ్రీదేవి

కోర్టు మూవీలో జాబిలి పాత్రలో తన నటనతో అందరినీ మాయ చేస్తున్న ముద్దుగుమ్మ శ్రీదేవి. ఈ అమ్మడుగు గురించి ఎంత చెప్పినా తక్కువే. తళుక్కుమనే అందం ఈ బ్యూటీ సొంతం. కోర్టు మూవీ రిలీజైన తర్వాత ఈ బ్యూటీ గురించి నెటిజన్స్ తెగ వెతికేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ బ్యూటీ కొన్ని ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందాల ముద్దుగుమ్మ శ్రీదేవి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. నాని నిర్మాతగా ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కిన కోర్టు మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఇందులో పేదింటి అమ్మాయిగా శ్రీదేవి జాబిలి పాత్రలో నటించి తన పాత్రకు ప్రాణం పోసిందనే చెప్పాలి. దీంతో శ్రీదేవి నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయితుండటంతో చాలా మంది ఎవరు ఈ బ్యూటీ అంటూ నెట్టింట తెగ సెర్చ్ చేస్తున్నారు. అయితే కోర్టు మూవీలో జాబిల్లి పాత్రలో మెరిసిన చిన్నది ఏపీలోని కాకినాడకు చెందిన తెలుగు అమ్మాయినే ఈ ముద్దుగుమ్మనంట. దీంతో ఈ బ్యూటీ గురించి నెట్టింట్లో తెగ సెర్చ్ చేయగా జాబిలి పాత ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. దీంతో బ్యూటీ అందానికి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ అయిపోతున్నారు. ఈ మూవీతోనే ఈ చిన్నది కుర్రకారు క్రష్ అయ్యిపోయింది. శ్రీదేవి పాత ఫొటోస్ చూసిన నెటిజన్స్ తన అందానికి మంత్ర ముగ్ధులు అవుతున్నారు. ఈ అమ్మడు తప్పకుండా స్టార్ హీరోయిన్ అవ్వడం కావడం పక్కా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం కోర్టు మూవీలో జాబిలిగా కుర్రకారు మనసు దోచేసిన ఈ ముద్దుగుమ్మ ఫొటోలపై మీరు కూడా ఓ లుక్ వేయండి.

# చీరకట్టులో ఆ అందమే వేరబ్బా..

ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్స్ హృదయాలను కట్టిపడేస్తుంది ఓ హీరోయిన్. చీరకట్టులో మరింత అందంగా కనిపిస్తూనే మెస్మరైజ్ చేస్తుంది. ఒకే ఒక్క సినిమాతోనే కుర్రాళ్ల గుండెలను దొచేసిన ఈ వయ్యారిని గుర్తుపట్టారా.. ? తనే హీరోయిన్ భవ్య త్రిఖ.మలయాళీ బ్యూటీ భవ్య త్రిఖ. తెలుగు, తమిళం, మలయాళం ప్రేక్షకులకు సుపరిచమైన హీరోయిన్. జ్యో సినిమాతో ఈ బ్యూటీ సౌత్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఫస్ట్ మూవీతోనే స్టార్ హీరోయిన్ రేంజ్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది.తమిళంలో విడుదలైన జ్యో సినిమాను ఇటు తెలుగులోనూ డబ్ చేశారు. అందమైన ప్రేమకథగా వచ్చిన ఈ మూవీలో రియో రాజ్ సరసన భవ్య త్రిఖ నటించింది. ఫస్ట్ మూవీతోనే అందం, అభినయంతో కట్టిపడేసింది.అయితే జ్యో సినిమా తర్వాత ఈ బ్యూటీకి తెలుగులో అంతగా ఆఫర్స్ రాలేదు. కానీ మలయాళంలో మాత్రం అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం అక్కడే వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది భవ్య.అలాగే అటు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పుడూ మోడ్రన్ దుస్తులలోనే కాకుండా చీరకట్టులో, లంగావోణిలో ఫోటోస్ షేర్ చేస్తూ కట్టిపడేస్తుంది భవ్య. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన పిక్స్ ఆకట్టుకుంటున్నాయి






# ఎంఎస్ ధోనితో యానిమల్ సినిమా తీసిన సందీప్‌రెడ్డి.?

ఇండియన్ స్టార్ క్రికెటర్ ఎంఎస్ ధోని యానిమల్ సినిమాలో నటించాడు. ధోని ఏంటి యానిమల్ సినిమా ఏంటి అనుకుంటున్నారా విషయం ఉందదండి. ప్రముఖ ఎలక్ట్రిక్ సైకిల్ బ్రాండ్ ఈమోటోరాడ్. తన కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంఎస్ ధోనిని నియమించుకున్న విషయం తెలిసిందే. ఎలక్ట్రిక్ సైకిల్ బ్రాండ్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ధోనీతో కలిసి ఒక యాడ్‌ను విడుదల చేసింది ఈ కంపెనీ. ఇందులో యానిమల్ సినిమాలో ఎంఎస్ ధోని నటిస్తే ఎలా ఉంటుందో అచ్చుగుద్దినట్లు ఫన్నీగా దింపారు దర్శకుడు సందీప్ రెడ్డి. ఎంఎస్ ధోని యానిమల్ సినిమాలో రణ్‌విజయ్ సింగ్(యానిమల్ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ పాత్ర పేరు)లా కనిపించడం.. ఇంటర్వెల్‌కి ముందు బ్లూ కోట్ లో బ్లాక్ కలర్ కార్ నుంచి దిగే సీన్, సినిమా ప్రారంభంలో హీరోయిన్ ఇంటికి హీరో వెళ్లే సీన్, క్లైమాక్స్ లో సైగ చేసి చూపించే సీన్. ఇలా రణ్‌బీర్ చేసే ప్రతి సీన్‌ని ధోనితో చేయించాడు సందీప్. ఫుల్ ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఉన్న ఈ స్పూఫ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.